# లిండే ఏఎస్‌యూ యూనిట్ స్టార్ట్

హైదరాబాద్, అక్టోబర్ 17: హైదరాబాద్‌కు సమీపంలోని పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేసిన ఎయిర్ సపరేషన్ యూనిట్ (ఏఎస్‌యూ)లో ఉత్పత్తిని ప్రారంభించినట్టు ప్రాక్సెయిర్ ఇండియా లిమిటెడ్ (లిండే) ప్రకటించింది. ఈ ప్లాంట్లో లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్, నైట్రోజన్, ఆర్గాన్‌సహా రోజుకు మొత్తం 250 టన్నుల వాయువులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు 2022లో లిండే సంస్థ.. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఏడాదిన్నరలోగా ప్లాంట్‌లో ఉత్పత్తిని ప్రారంభించడం విశేషమని లిండే-ఇండియా విక్రయ హెడ్ ఆర్‌సీ కౌశిక్ తెలిపారు.

# భూషణ్ స్టీల్ ప్రమోటర్లపై ఈడీ దాడులు

**రూ.56,000 కోట్ల బ్యాంక్ ఫ్రాడ్ కేసు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: భూషణ్ స్టీల్ లిమిటెడ్ (బీఎస్‌ఎల్) ప్రమోటర్లు, అనుబంధ సంస్థలపై ఈడీ దాడులు జరిపింది. రూ.56,000 కోట్ల మేరకు బ్యాంక్‌లకు టోపీ వేసి, నిధులు మళ్లించారన్న కేసులో భాగంగా జరిగిన దాడుల్లో రూ.72 లక్షల నగదు, రూ.52 లక్షల విలువైన విదేశీ కరెన్సీ/ట్రావెలర్ చెక్కులు, రూ.4 కోట్ల విలువైన మూడు లగ్జరీ కార్లను స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. బీఎస్‌ఎల్ ఎండీ నీరజ్ సింఘాల్, ఆయన సహచరులు పలు షెల్ కంపెనీలు ఏర్పాటుచేసి, నిధులు మళ్లించారని ఈడీ ఆరోపించింది. బీఎస్‌ఎల్ ప్రమోటర్లు, డైరెక్టర్లు, అధికారులు నకిలీ డాక్యుమెంట్లు రూపొందించి, ఎల్‌సీలను (లెటర్స్ ఆఫ్ క్రెడిట్) బ్యాంక్‌ల్లో డిస్కౌంట్ చేసుకుని, ఆ నిధుల్ని వారి సొంత షెల్ కంపెనీలకు మళ్లించుకున్నారని ఈడీ వివరించింది. దీంతో ఎస్బీఐ, పీఎన్‌బీలకు భారీ నష్టం కల్గించారన్నది. ఈ ఏడాది జూన్‌లో నీరజ్ సింఘాల్‌ను ఈడీ అరెస్టు చేసింది. ఈ కేసులో ఇప్పటివరకూ రూ.61.38 కోట్ల విలువైన ఆస్తుల్ని స్వాధీనం చేసుకుంది. 2018లో భూషణ్ స్టీల్‌ను టాటా స్టీల్ టేకోవర్ చేసింది.

## ఐఎంపీఎస్‌తో 5 లక్షల బదిలీ


న్యూఢిల్లీ, అక్టోబర్ 17: ఇమీడియట్ పేమెంట్ సర్వీసెస్ (ఐఎంపీఎస్)ను నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) సరళీకరించింది. ఇప్పటివరకూ పెద్ద మొత్తంలో ఐఎంపీఎస్ ద్వారా నగదు పంపించాలంటే బెనిఫీషియరీని బ్యాంక్ ఖాతాకు యాడ్ చేసుకోవాల్సి వచ్చేది. ఇక నుంచి మొబైల్ నంబర్, బ్యాంక్ పేరు, నగదు స్వీకరించే వారి పేరు ఉపయోగించి రూ. 5లక్షల వరకు నగదు పంపవచ్చని ఎన్‌పీసీఐ తెలిపింది.

## నగరంలో బ్రిగేడ్ విస్తరణ

హైదరాబాద్, అక్టోబర్ 17: బెంగళూరుకు చెందిన రియల్టీ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్.. హైదరాబాద్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తున్నది. ఈ క్రమంలోనే రూ.660 కోట్లతో 9.71 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. కోకాపేట్ నియోపోలిస్‌లో ఈ భూమిని సొంతం చేసుకున్నది. అయితే ఈ స్థలంలో ఏ ప్రాజెక్టును తీసుకురాబోతున్నారో ఆ వివరాలేవీ సంస్థ తెలియపర్చలేదు.

# అమ్మకానికి హడ్కో వాటా

ముంబై, అక్టోబర్ 17: కేంద్ర ప్రభుత్వం తాజాగా హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) వాటా అమ్మకానికి తెరతీసింది. ఖజానాకు రూ.1,100 కోట్లు సమకూర్చుకునేందుకు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా 7 శాతం వాటాను విక్రయించనున్నది. అది కూడా ప్రస్తుత మార్కెట్ ధరకంటే భారీగా 12 శాతం డిస్కౌంట్‌తో ఆఫర్‌ను తీసుకొస్తున్నది. ఈ నెల 18-19 తేదీల్లో వచ్చే ఓఎఫ్ఎస్‌కు షేరుకు రూ.79 చొప్పున ఫ్లోర్ ధరను నిర్ణయించింది. మంగళవారం బీఎస్ఈలో హడ్కో షేరు రూ.89 వద్ద ముగిసింది. ఓఎఫ్ఎస్ తొలిరోజున 7 కోట్ల షేర్లను (3.5 శాతం వాటా) ఆఫర్ చేస్తుండగా, మరుసటి రోజున గ్రీన్‌షూ ఆప్షన్‌గా మరో 7 కోట్ల షేర్లు విక్రయించనున్నది. 18న రిటైల్ ఇన్వెస్టర్లకు, 19న నాన్-రిటైలర్లకు ఆఫర్ ఉంటుంది. ప్రస్తుతం హడ్కోలో కేంద్రానికి 81.8 శాతం వాటా ఉన్నది. తాజా విక్రయంతో ఈ వాటా 74.8 శాతానికి దిగివస్తుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల్ని అమ్మడం ద్వారా రూ.51,000 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని కేంద్రం నిర్ణయించుకుంది.



# అడ్డగోలుగా జనం సొమ్ము లూటీ

*సెప్టెంబర్ 2021 నుంచి జూలై 2023 మధ్య అదానీ కంపెనీల ద్వారా భారత్‌లోకి 2000సార్లు దిగుమతులు జరుగగా, 73 మిలియన్ టన్నుల బొగ్గు వచ్చింది. అదానీ గ్రూప్‌లోని అదానీ ఎంటర్‌ప్రైజెస్ పేరిటే ఎక్కువసార్లు దిగుమతులు జరిగాయి.*

**విదేశాల నుంచి అదానీ కంపెనీల బొగ్గు దిగుమతుల వెనుక పెద్ద అవినీతే సాగింది. అంతకుమించి కోట్లాదిమంది అమాయకుల కష్టార్జితం అదానీ జేబుల్లోకి చేరింది.**

- తక్కువ ధరకు విదేశాల్లో అదానీ బొగ్గు కొనుగోలు
- దేశీయంగా అధిక రేట్లకు విద్యుత్తు అమ్మకాలు
- వ్యాపార, పారిశ్రామిక రంగాలూ కుదేలు
- ఎక్కువ ధరను చూపిస్తూ సొంత పోర్టుల్లో దిగుమతి
- సామాన్యులపై మోయలేనంత చార్జీల భారం
- మధ్యవర్తుల ద్వారా అక్రమార్జనకు దిగిన వైనం

**తక్కువ ధరతో కొని ఎక్కువ ధరల్ని చూపిస్తూ దేశంలోకి దించుకున్న బొగ్గు కొండలను గౌతమ్ అదానీ తన అక్రమార్జనకు వాడుకున్నారని తేలింది.**

**సొంత ఓడరేవుల సాయంతో భారీ అవకతవకలకే పాల్పడగా.. విద్యుత్తు చార్జీల భారం వ్యాపార, పారిశ్రామిక రంగాలనూ దెబ్బ తీసింది. ఇప్పటికే కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు అండతో అదానీ సంపద అడ్డగోలుగా పెరిగిందంటూ స్టాక్ మార్కెట్ ఉల్లంఘనల్ని హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. ఈ క్రమంలో ఇప్పుడీ బొగ్గు బాగోతం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది.**

**అదానీ** కంపెనీలు వేసే ప్రతీ అడుగు వెనుకా అవినీతే ఉంటుందని మరోమారు బహిర్గతమైంది. దేశంలో అపారమైన బొగ్గు నిల్వలున్నా, అవి ఇక్కడ చౌక ధరకే లభిస్తున్నా.. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ దేశ సంపదను కొల్లగొట్టి, సొంత ఆస్తులను గౌతమ్ అదానీ కూడబెట్టుకున్న తీరు విస్మయానికే గురిచేస్తున్నది. కొంతమంది దురాశకు దేశంలోని కోట్లాదిమంది సామాన్యులు ఎలా నష్టపోయారు.. వ్యాపార, పారిశ్రామిక రంగాలు ఎంతలా దెబ్బతిన్నాయన్నది బయటపడింది. ఓ ప్రముఖ జాతీయ దినపత్రిక చేపట్టిన కస్టమ్స్ రికార్డుల సమీక్షల్లో అదానీ బొగ్గు బాగోతం అంతా వెలుగుచూసింది మరి. ఇక ఆయా విదేశీ కంపెనీల్లో అదానీ కుటుంబ సభ్యులు డైరెక్టర్లుగా, ఇక్కడి అదానీ కంపెనీల్లో సదరు విదేశీ సంస్థలవారు డైరెక్టర్లుగా ఉండటం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది.

### సొంత పోర్టుల అండతో

రాజకీయ అండదండలతో అన్ని రంగాలనూ తన గుప్పిట్లో పెట్టుకుంటున్న గౌతమ్ అదానీ.. అదే ధైర్యంతో భారీ అక్రమాలకే తెగబడినట్టు ఫైనాన్షియల్ టైమ్స్ చెప్తున్నది. దేశంలో సరిపడా బొగ్గు నిల్వలున్నా.. తక్కువ ధరకే అవి లభిస్తున్నా.. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ దేశ సంపదను దోచుకున్నారని, తద్వారా అభివృద్ధిని అడ్డుకున్నారన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయిప్పుడు. భారతీయ అతిపెద్ద ప్రైవేట్ బొగ్గు దిగుమతిదారుగా ఉన్న అదానీ గ్రూప్.. విదేశాల నుంచి తక్కువ ధరకే బొగ్గును కొని.. సొంత పోర్టుల్లో దిగుమతి చేసుకున్నదని, రికార్డుల్లో మాత్రం సదరు బొగ్గుకు ఎక్కువ ధరల్ని చూపించిందని తేలింది. ఈ బొగ్గుతో దేశీయంగా విద్యుదుత్పత్తిని చేసి మరింత ఎక్కువ ధరకు అదానీ కంపెనీలు అమ్ముకోవడం గమనార్హం. దీనివల్ల దేశంలోని కోట్లాదిమంది సామాన్య ప్రజలు నష్టపోగా.. వ్యాపార, పారిశ్రామిక రంగాలూ కుదేలయ్యాయి. విద్యుత్తు రంగంలో ద్రవ్యోల్బణానికీ అదానీ గ్రూప్ కారణమైంది. అంతేగాక దేశ ఖజానాకు రావాల్సిన సొమ్ము.. అదానీ వల్ల విదేశాలకు ఆదాయంగా మారిందన్న విమర్శలూ ఇప్పుడు ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

### ఏడేండ్ల క్రితమే..


అదానీ గ్రూప్ అక్రమాలు ఏండ్ల తరబడి బయటకొస్తూనే ఉన్నాయి. కానీ నరేంద్ర మోదీతో ఉన్న సంబంధాలు.. గౌతమ్ అదానీకి క్లీన్‌చిట్‌నే ఇస్తున్నాయి. నిజానికి ఏడేండ్ల క్రితమే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని డైరెక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ).. అదానీ సంస్థల అక్రమాలను గుర్తించింది. ఇండొనేషియా నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటూ దేశంలో కృత్రిమ బొగ్గు కొరతను సృష్టిస్తున్నారని, దీన్ని విదేశాలకు ధనాన్ని తరలించే మార్గంగానూ మార్చుకుంటున్నారని అదానీసహా 40 దిగుమతిదారులకు 2016లో డీఆర్ఐ నోటీసులిచ్చింది. అసలు పోర్టుల్లో దిగుమతైన బొగ్గుకు చూపించిన ధరల్లో 50 శాతానికే కొంటున్నారన్నది. ఈ బొగ్గుతో తయారైన విద్యుత్తును అధిక ధరలకు అమ్ముకుంటున్నారని ఆరోపించింది. ఎక్కువ ధరకు విద్యుత్తును కొని ప్రజలు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు నష్టపోతున్నాయని తేల్చిచెప్పింది. అయితే కేంద్రంలో ఉన్నది నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వమే కాబట్టి.. డీఆర్ఐ చూపించిన రుజువులేవీ చెల్లలేదు.

*- బిజినెస్ డెస్క్*

### మోదీతో స్నేహం..

గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న దగ్గర్నుంచే నరేంద్ర మోదీతో గౌతమ్ అదానీ స్నేహం కొనసాగుతున్నది. మోదీ దేశ ప్రధాని కావడంతో ఈ బంధం మరింత బలపడిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతూనే ఉన్నాయి. అదానీ గ్రూప్ ఆయా రంగాల్లోకి ఎలా విస్తరించింది.. వివిధ కంపెనీలను ఎలా హస్తగతం చేసుకున్నది.. దేశంలో, ఆసియా ఖండంలోనే అత్యంత సంపన్నుడిగా గౌతమ్ అదానీ ఎలా ఎదిగారన్నది తెలిసిందే. ఇక అదానీ గ్రూప్ స్టాక్ మార్కెట్ అక్రమాలపై అమెరికాకు చెందిన హిండెన్ బర్గ్ ఇచ్చిన రిపోర్టు ఎంత అలజడి రేపిందో కూడా విదితమే. అదానీ కోసం ప్రధాని హోదాలో మోదీ చేసిన విదేశీ టూర్లు, అక్కడ కుదుర్చుకున్న ఒప్పందాలపైనా రచ్చ కొనసాగుతూనే ఉన్నది. బీఆర్ఎస్‌సహా విపక్షాలు.. పార్లమెంట్‌లో ఆందోళన చేసిందీ చూశాం.

**2021 జూలై నుంచి హీ లింగోస్, తౌరుస్ కమోడిటీస్ జనరల్ ట్రేడింగ్, ప్యాన్ ఆసియా ట్రేడ్‌లింక్ కంపెనీలకు మొత్తం 4.8 బిలియన్ డాలర్లు చెల్లించిన అదానీ గ్రూప్.**




తైవాన్, దుబాయ్, సింగపూర్ దేశాల్లోని మధ్యవర్తులను వాడుకొని గడిచిన రెండేండ్లకుపైగా కాలంలో 5 బిలియన్ డాలర్ల విలువైన బొగ్గు దిగుమతుల్ని చేసుకున్న అదానీ గ్రూప్.

భారతీయ మార్కెట్‌లో ఉన్న బొగ్గు ధరతో పోల్చితే రెట్టింపునకుపైగా ధరను చూపించిన అదానీ కంపెనీలు.

అదానీ కంపెనీల్లో పెద్ద ఎత్తున వాటాలున్న ఓ రహస్య భాగస్వామికి చెందిన తైవాన్ సంస్థల ద్వారా చురుగ్గా లావాదేవీలు.

**2019-2021 మధ్య 32 నెలలకుపైగా కాలంలో అదానీ కంపెనీ ద్వారా భారత్‌కు ఇండోనేషియా నుంచి 30సార్లు జరిగిన బొగ్గు దిగుమతులు. ప్రతిసారీ విదేశాల్లో కొన్న రేటు కంటే స్వదేశంలో ఎక్కువ రేటునే పేర్కొన్న అదానీ. ఇలా రూ.600 కోట్లకుపైగా లాభం పొందిన సంస్థ.**

భారత్‌కు ఇండోనేషియా నుంచి 30సార్లు 3.1 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతైంది. విలువ 139 మిలియన్ డాలర్లు. షిప్పింగ్, ఇన్సూరెన్స్ 3.1 మిలియన్ డాలర్లు అదనం. భారత్‌కొచ్చేసరికి 215 మిలియన్ డాలర్లకు చేర్చిన అదానీ.

**అదానీ గ్రూప్‌లోని ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు వచ్చే ఆదాయంలో బొగ్గు లావాదేవీల ద్వారా సమకూరేదే ఎక్కువ. అదానీ కోల్ ట్రేడింగ్ విభాగం పేరు ఇంటిగ్రేటెడ్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్. దీని లాజిస్టిక్స్, కమోడిటీ ట్రేడింగ్‌లో 200 మంది నిపుణులు పనిచేస్తారు. వీరంతా నాలుగు అంతర్జాతీయ కార్యాలయాలు, 19 భారతీయ కేంద్రాల్లో ఉంటారు.**

2019 జనవరిలో ఇండోనేషియా నుంచి 74,820 టన్నుల బొగ్గు దేశంలోకి దిగుమతి. ఇండోనేషియా ఎగుమతి రికార్డుల్లో ఈ బొగ్గు ధర 1.9 మిలియన్ డాలర్లుగా, షిప్పింగ్, ఇన్సూరెన్స్ 42,000 డాలర్లుగా ఉన్నది. కానీ గుజరాత్‌లోని తమ సొంత ముంద్రా పోర్టులో దిగుమతి రికార్డుల్లో 4.3 మిలియన్ డాలర్లుగా పేర్కొన్న అదానీ.

**తైవాన్‌లోని హీ లింగోస్, దుబాయ్‌లోని తౌరుస్ కమోడిటీస్ జనరల్ ట్రేడింగ్, సింగపూర్‌లోని ప్యాన్ ఆసియా ట్రేడ్‌లింక్ మధ్యవర్తిత్వ సంస్థల ద్వారా అదానీ గ్రూప్‌నకు ప్రధానంగా విదేశాల నుంచి బొగ్గు దిగుమతులు.**









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.